క్లుప్తంగా

నేడు శివపార్వతుల కల్యాణం

ఖమ్మంగాంధీచౌక్: కార్తీక మాసం బహుళ చతుర్దశి సందర్భంగా ఖమ్మం నగరంలోని మామిళ్లగూడెం రామాలయం రోడ్డు డైమండ్ టవర్స్ వద్ద సోమవారం సాయంత్రం 5:25 గంటలకు శివ పార్వతుల కల్యాణ మహోత్సవం 13వ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పర్సా శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పువ్వాడనగర్ శివాలయంలో..

రఘునాథపాలెం: మండలంలోని పువ్వాడనగర్ గుట్టపై శ్రీ గిరి పర్వతం పైవేల శ్రీనివాస్ స్వయంభు శ్రీ గంగా పార్వతీ సమేత సోమలింగేశ్వర స్వామి కల్యాణమహోత్సవం సోమవారం సాయంత్రం 6.30 గంటలకు జరుగుతుందని దేవాలయ అర్చకులు ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించుతున్నట్లు భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వైద్యశిబిరం విజయవంతం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నేలకొండపల్లి: మండల కేంద్రంలో స్థానిక రావెళ్ల భవన్‌లో ఏర్పాటు చేసిన నెల నెల వైద్య శిబిరం విజయవంతమైంది. ఆదివారం నిర్వహించిన వైద్యశిబిరంలో 162 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతక్కి గంగాధర్ సేవా కమిటీ కన్వీనర్ ఏటుకూరి రామారావు మాట్లాడారు.. వైద్య శిబిరానికి మంచి స్పందన లభిస్తుందన్నారు. శిబిరానికి సహకరిస్తున్న ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కె.వీ.రెడ్డి, నాగేశ్వరరావు, వల్లంచెట్ల భాస్కర్‌రావు, దండా సైదారావు, సూర్యానారాయణ, మంకెనపల్లి నరసింహారావు, రహీ, బొడ్డు బాబురావు, జమాల్, సామల మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు సర్వజ్ఞ విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న డైరెక్టర్ నాగేంద్రకుమార్

ఖమ్మం సహకారనగర్: వరంగల్‌లో జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ఇటీవల జరిగిన 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిమ్నాస్టిక్స్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థిని వడ్లముడి చైత్రశ్రీ అద్భుతమైన ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు సర్వజ్ఞ స్కూల్ డైరెక్టర్లు ఆర్‌వి.నాగేంద్రకుమార్, నీలిమలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ప్రతిభ కనబర్చిన విద్యార్థిని అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ...హోప్, బాల్, రిథమేటిక్ జిమ్నాస్టిక్స్‌లో బ్రాంజ్‌మెడల్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

నగరంలో సినిమాలు

తిరుమల	యానిమల్
వినోద	హాయ్ నాన్న
సాయిరాం	సహస్ర
ఆదిత్య	యానిమల్
శ్రీనివాస	ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	30	బచ్చలికూర	3
వంకాయ	56		10
బెండకాయ	60	పాలకూర	3
పచ్చిమిర్చి	30		20
కాకర	54	చుక్కకూర	3
బోడ కాకర	100		20
బీర	60	తోటకూర	3
దొండ	34		10
పొట్లకాయ	30	గోంగూర	2
చిక్కుడు	70		10
గోరుచిక్కుడు	46	మెంతికూర	2
క్యాబేజీ	18		10
క్యాలీఫ్లవర్	25	కొత్తిమీర	1
ఆలుగడ్డ	30		30
చామగడ్డ	46	పుదీన	1
క్యారెట్	46		20
క్యాప్సికం	60	-ఖమ్మం వ్యవసాయం	

ప్రయాణం.. నరకప్రాయం

కంకర తేలి గుంతలమయంగా గుదిమళ్ల రోడ్డు

- ఖమ్మానికి కూతవేటు దూరంలోనే ఉన్నా అధ్వానంగా రహదారి
- హామీ ఎన్నికల వరకేనా అని ప్రశ్నిస్తున్న ప్రజలు



కంకర తేలి పెద్ద పెద్ద గుంతలు పడిన గుదిమళ్ల రోడ్డు

ఖమ్మంరూరల్: ప్రతీ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యం అంటూ పాలకులు ఊదరగొట్టు ప్రసంగాలు చేయడం అనంతరం హామీని విస్మరించడం సర్వసాధారణమేనని గుదిమళ్ల వాసులు మండి పడుతున్నారు. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న గుదిమళ్ల గ్రామం ప్రకాష్‌నగర్ నుంచి కేవలం మూడు కిలోమీటర్లు ఉంటుంది. ఇక ఈరోడ్డుపై ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. ఒకసారి ఈ రోడ్డులో ప్రయాణం చేస్తే మరో రెండు రోజులు విశ్రాంతి తీసుకోవాల్సిందేనని అంటే రోడ్డు దుస్థితి అంత దారుణంగా ఉందనేది చెప్పకనే చెప్పొచ్చు.

వాహనదారుల బాధలు వర్ణనాతీతం..

గ్రామం నుంచి ప్రతీ నిత్యం ఏ అవసరం కావాలన్నా ఖమ్మం రావాల్సిందే. అయితే రోడ్డు మొత్తం కంకర తేలి పెద్ద గుంతలతో దర్శనమిస్తోంది. వాహనం కదలాలంటే చాలా నెమ్మదిగా వెళ్లాలి. అయినా బాగా కుదుపులకు గురికావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలోనే రైతులు తమ పొలాలకు ఎరువులు, పంట ఉత్పత్తులు తీసుకుపోతుంటారు. ఇకవారి బాధలు వర్ణనాతీతం. ఇక వర్షాకాలమైతే నడవటమే కష్టతరంగా ఉంటుంది. ఈ గ్రామానికి వయా వెంకటగిరి నుండి కూడా వెళ్లొచ్చు అయితే ఆమార్గంలో వెళితే పది కిలో మీటర్లు వెళ్లాల్సిందే. అంటే ఏడు కిలో మీటర్లు అదనంగా దూరం చుట్టూ తిరిగి ఖమ్మం వెళ్లాల్సి ఉంటుంది. దీంతో వాహనం ఖర్చు, సమయం వృథా తప్పా మరేమీ ఉండదు. గత ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీల నేతలు తమను గెలిపిస్తే తక్షణమే రోడ్డు నిర్మిస్తామని చెప్పి అనంతరం ఈరోడ్డు గురించి పట్టించుకున్న పాపాన పోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. గతంలో కొన్నేళ్ల ఈ గ్రామాన్ని ఖమ్మం నగరంలో విలీనం చేశారు. అనంతరం తిరిగి పంచాయతీగా ఏర్పడింది. అయితే పంచాయతీ పాలక వర్గం ఎన్నిక జరగలేదు. దీంతో ఈ రోడ్డు దుస్థితిని అటు ఖమ్మం నగరపాలక సంస్థ కానీ, గతంలో ఉన్న పంచాయతీ పాలకులు కానీ ఏమాత్రం పట్టించుకోకపోవడంతో ఏళ్ల తరబడి బీటీ రోడ్డు నిర్మాణానికి మోక్షం కలగడంలేదు. ఇప్పటికైనా బీటీ రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డుపై నడవలేని దుస్థితి ఉంది



పొద్దున్న లేచింది మొదలు రాత్రి వరకు ఈరోడ్డుపైనే వెళ్లాలి. వ్యవసాయానికి సంబంధించిన ఎరువులు, పంట ఉత్పత్తులు తరలించడం, ఖమ్మం వెళ్లాలన్నా చాలా ఇబ్బందిగా ఉంది. గత 20 ఏళ్ల క్రితం కంకర రోడ్డు వేసి వదిలి వేశారు. అప్పటి నుండి ఎవరూ రోడ్డు గురించి పట్టించుకోవడంలేదు. తక్షణమే బీటీ రోడ్డు నిర్మించాలి.

– పటేల్ వెంకటేశ్వర్లు, గుదిమళ్ల

ఎన్నిసార్లు చెప్పినా ఉపయోగం లేదు



బీటీ రోడ్డు నిర్మించాలని ఎన్నిసార్లు చెప్పినా ఉపయోగం లేకుండా పోయింది. ఎన్నికల సమయంలో వస్తారు రోడ్డు వేస్తాం అంటారు పోతారు. ఆతర్వాత పరిస్థితి యథావిధిగా కంకర తేలిన రోడ్డు మాత్రమే దర్శనమిస్తుంది. రైతులు, వాహనదారులు ఈరోడ్డుపై నడవాలంటే నరకం గుర్తుకు వస్తోంది. మా బాధలను గుర్తించి రోడ్డు వేయాలి.

– రానేరు ఖైదు, గుదిమళ్ల

ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలి



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: భారత్ బచావో వేదికలో పనిచేస్తున్న ప్రముఖ వైద్యుడు ఎంఎఫ్.గోపీనాథ్, గాదె ఇన్నయ్య, జంజర్ల రమేష్ తదితరులపై బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు పెట్టిన ఉపా చట్టాన్ని ఉపసంహరించాలని రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వానికి సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఆదివారం యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన ఖమ్మం నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 2014 నుండి ఖమ్మం జిల్లాలో ప్రతిపక్షాలు, ప్రజా సంఘాల నాయకులపై అక్రమ కేసులు బనాయించబడ్డాయన్నారు. జిల్లా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవ తీసుకొని ఈ అక్రమ కేసులన్నింటినీ ఉపసంహరింపచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు వై.విక్రం, శ్రీనివాసరావు, ఎం ఎ.జబ్బార్, నవీన్‌రెడ్డి, షేక్ మీరాసాహెబ్, దొంగల తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించిన వారిపై కేసులు..

2014 నుంచి 2023 వరకు ప్రభుత్వం అక్రమంగా మోపిన ఉద్యమ కేసులను ఎత్తివేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ డిమాండ్ చేశారు. ఖమ్మం నగరంలోని స్థానిక రామనరసయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సంఘం డివిజన్ ఆఫీస్ బేరర్ సమావేశంలో ఆజాద్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం ప్రజా సమస్యలు పరిష్కరించకుండా.. ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టడం, ధర్నాచౌక్‌లను ఎత్తివేయడం లాంటి ఘటనలకు పాల్పడిందన్నారు. ఉద్యమాలను అణచివేసేందుకు అక్రమ కేసులు పెట్టించిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యు చేసిన ఉద్యమాలలో అనేక కుట్ర కేసులు నమోదు చేసి నిర్బంధించడం జరిగిందన్నారు. ఇలా అనేక ఉద్యమాలు చేసిన ప్రజా ఉద్యమకారులపై, విద్యార్థి సంఘాల నాయకులపై నిరుద్యోగులపై కేసీఆర్ ప్రభుత్వం విధించిన కేసులన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తివేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వెంకటేష్, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు సతీష్, లక్ష్మణ్, సహాయ కార్యదర్శి కరుణ్, ఉపాధ్యక్షులు వినయ్ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



మిర్చి తోటలను పరిశీలిస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: మిచాంగ్ తుపాను వలన నష్టపోయిన మిర్చి, వరి, మొక్కజొన్న పంటలకు కొత్తగా ఏర్పాటయిన కాంగ్రెస్ ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని బచ్చోడు గ్రామంలో నష్టపోయిన మిర్చి, వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. మిర్చి తోటలు మొత్తం నేలకు వరిగి చచ్చిపోతున్నాయని, కోతకు వచ్చిన వరి ధాన్యం తడిసి మొక్కలు ఎత్తుతున్నాయన్నారు. రైతాంగం లక్షలాది రూపాయలు అప్పులు చేసి వ్యవసాయానికి పెట్టుబడి పెట్టి సేద్యం చేస్తున్నారని, గ్రామీణ ప్రాంతంలో రైతాంగం దిక్కుతోచని స్థితిలో ఉందన్నారు. అధికార యంత్రాంగాన్ని గ్రామాలలో పంట నష్టం సర్వేలకు పంపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్ మండల నాయకులు గొర్రెపాటి వీరస్వామి, బింగి శ్రీను, సకినాల వెంకన్న, దారమళ్ల శంకర్, గోపి, రమేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

'తలసేమియా' చిన్నారులకు మందుల పంపిణీ



మందులు అందజేస్తున్న సంస్థ సభ్యులు

ఖమ్మం వైద్యవిభాగం: సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం తలసేమియా చిన్నారులకు ఉచిత మందులు పంపిణీ చేశారు. సంస్థ కోశాధికారి ప్రొద్దుటూరి రవిచంద్ర, డాక్టర్ నారాయణమూర్తిలు చిన్నారులకు మందులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చిన్నారులు, తల్లిదండ్రులు సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలని, వైద్యుల సూచనల మేరకు మందులను వినియోగించాలని సూచించారు. చిన్నారులకు రక్తం కొరత ఏర్పడడంతో సంస్థ ఆధ్వర్యంలో రితన్య ఆస్పత్రిలోని తలసేమియా డేకేర్ సెంటర్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని, చిన్నారుల బంధువులు, కుటుంబ సభ్యులు, దాతలు ముందుకొచ్చి తమ పిల్లలకు రక్తదానం చేయాలని కోరారు. అనంతరం సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రాజేష్‌గార్గె జన్మదినం సందర్భంగా చిన్నారులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు ప్రొద్దుటూరి ఉదయ్‌భాస్కర్, నెల్లూరి ఉపేందర్, వెంకటేశ్వర్లు సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మేడే కానుక కార్మికుల ఖాతాల్లో జమ చేయాలి



మాట్లాడుతున్న రామయ్య

ఖమ్మంమయూరిసెంటర్: మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు గత పాలకులు ప్రకటించిన మేడే కానుక రూ.1,000లను వెంటనే కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పారిశుద్ధ్య పనులు చేస్తూ నిరంతరం శ్రమిస్తున్న కార్మికులకు ఇచ్చిన హామీలను కూడా పాలకులు, అధికారులు నిలబెట్టుకోలేదన్నారు. అధికారులను కానుకల గురించి అడిగితే రేపుమాపు అంటూ కాలం వెల్లదీస్తున్నారన్నారు. కార్మికులకు ఇవ్వాల్సిన కానుక వేతనాలు వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మున్సిపల్ కార్యాలయాల ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నగర అధ్యక్ష, కార్యదర్శులు కంకణాల శ్రీనివాస్, కొయ్యల శ్రీనివాస్, తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్‌టీయూ అనుబంధం నగర అధ్యక్షుడు జిట్టి గురవయ్య, నగర కార్యదర్శి దున్న గురవయ్య, నాయకులు నారాయణ, ప్రసాద్, పార్థు, వీరబాబు, మోహన్‌రావు, ధర్మయ్య, సురేష్ పాల్గొన్నారు.

రఘుకుమార్‌కు మహానంది పురస్కారం



పురస్కారం అందుకుంటున్న రఘుకుమార్

కామేపల్లి: మండలంలోని ఎంజేపల్లి హైస్కూల్ ఉపాధ్యాయుడు జిందం రఘుకుమార్ జ్యోతిష్యం, వాస్తు రంగంలో విశేష సేవలు అందించినందుకు గానూ మహానంది జాతీయ గౌరవ పురస్కారం అందుకున్నాడు. ఆదివారం ఏపీలోని విజయవాడ ఎన్టీఆర్ జిల్లాలో తెలుగు వెలుగు సాహితీవేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన నిర్వహించిన పురస్కారాల మహోత్సవ కార్యక్రమంలో రఘుకుమార్‌కు సంస్థ వ్యవస్థాపక చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్, ప్రతినిధుల చేతుల మీదుగా పురస్కారాన్ని అందించి సత్కరించారు.

అండర్-19 క్రికెట్ జట్టుకు ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోన వీరు క్రికెట్ అకాడమీకి చెందిన జి.రిషికేష్‌గౌడ్, టి.శశిరిక్‌లు జిల్లా జూనియర్ కళాశాలల క్రికెట్ జట్టుకు ఎంపికయ్యారు. ఈనెల 15 నుంచి మహబూబ్ నగర్ జిల్లా గద్వాలలో జరిగే రాష్ట్రస్థాయి అండర్-19 క్రికెట్ టోర్నీలో జిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనున్నారని కోచ్ వీరేష్‌గౌడ్ తెలిపారు.

అయ్యప్పల ఇరుముడి



ఇరుముడి కడుతున్న గురుస్వామి

నేలకొండపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో అయ్యప్ప మాలధారణ భక్తుల ఇరుముడి కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. మండలంలోని కొత్తకొత్తూరు లోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం ఇరుముడి కార్యక్రమం వైభోపేతంగా నిర్వహించారు. విజయవాడకు చెందిన ప్రధాన గురుస్వామి రాజా గురుస్వామి మాల ధారణ భక్తులకు ఇరుముడి కట్టారు. గురుస్వామి గొరెంట్ల నరసింహారావు స్వామి, మాదాసు శ్రీనివాసరావు, పావులూరి వెంకటేశ్వరరావు, చట్టు ధనమూర్తి, కొమ్మూరి నరేష్, విజయ్, పసుపులేటి సైదులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని గాయత్రి డిగ్రీ కళాశాల విద్యార్థిని తేజస్విని కాలేజీ ఫీజు నిమిత్తం ఎన్‌ఆర్‌ఐ చెన్నా చరణ్, లయన్స్ క్లబ్ సభ్యులు రూ. 16 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఆదివారం కాలేజీలో తేజస్వినికి నగదును లయన్స్ క్లబ్ ప్రతినిధులు అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు టి కృష్ణారెడ్డి, వేముల హనుమంత రావు, జోన్ చైర్మన్ డాక్టర్ డీపీ సీరావు, కల్వకుంట్ల గోపాల్ రావు, మేకా దుర్గా నాగేశ్వరరావు, అవోపా కృష్ణమూర్తి, అత్తలూరి గోవర్ధన్, కొంకిమళ్ల విశ్వేశ్వరరావు, సుబ్బారావు, ప్రిన్సిపల్ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

నేలకొండపల్లి: రోడ్డు దాటుతుండుగా ద్విచక్ర వాహనం ఢీ కొని వ్యక్తి కి తీవ్ర గాయాలైన ఘటన మండలకేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన వంగూరి దుర్గయ్య మండల కేంద్రంలో ఒక వైన్స్ షాపు వద్ద నైట్ వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే విధులు ముగించుకుని ఇంటికి తిరిగొస్తున్న క్రమంలో ఒక యువకుడు బైక్‌తో ఢీ కొట్టాడు. దీంతో రోడ్డుపై పడటంతో తీవ్రంగా గాయాలయ్యాయి. నేలకొండపల్లి ప్రభుత్వ హాస్పిటల్‌లో ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. ఈ మేరకు బాధితుడి కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అటెన్షన్ ప్లీజ్

వామ్మో.. వంతెన!



మండలంలోని వీవీపాలెం నుంచి వేపకుంట్ల, చింతగుర్తి ఆర్‌అండ్‌బీ రోడ్డులో వీవీపాలెం గ్రామ సమీపాన ఉన్న సాగర్ కాల్వపై వంతెన శిథిలావస్థకు చేరుకొని పెచ్చులు ఊడి ఇదిగో ఇలా ప్రమాదకరంగా మారింది. నిత్యం ఈ రహదారిపై వీవీపాలెం, వేపకుంట్ల, గణేశ్వరం, చింతగుర్తి తదితర గ్రామాలకు చెందిన వారు ఈ వంతెనపై బిక్కు బిక్కు మంటూ రాకపోకలు సాగిస్తున్నారు. వంతెన నిర్మాణం కోసం గత రెండేళ్ల క్రితమే సుమారు రూ.65 లక్షల అంచనాలతో జలవనరుల శాఖ అధికారులు అంచనాలు వేశారు కానీ ఇంత వరకూ మంజూరు కాలేదు. ఇప్పటికైనా అధికారులు తమ బాధలను గుర్తించి ప్రమాదాల బారిన పడి ప్రాణ, ఆస్తి నష్టం జరకముందే శిథిలమైన వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

- రఘునాథపాలెం

వైభవోపేతంగా వనసమారాధనలు



ఖమ్మంగాంధీచౌక్: వనసమారాధనలో పూజ నిర్వహిస్తున్న మహిళలు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని త్రివిక్రమ ప్రాంగణం(చెరుకూరి మామిడి)లో ఆదివారం జరిగిన బ్రాహ్మణ కార్తీక దామోదర మహోత్సవ వన సమారాధన సందడిగా సాగింది. ఈ సందర్భంగా కార్తీక దామోదర వ్రతాన్ని సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. లలిత కవి, నంది అవార్డు గ్రహీత నాటక రచయిత హరి వేంకట లక్ష్మీ ప్రసాద్ బాబు ప్రవచనాలను వినిపించారు. మిమిక్రీ భరత నాట్యం, సంగీత కార్యక్రమాలు అలరించాయి. రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీసీ కార్పొరేషన్ దేవులపల్లి ఆంజనేయ శర్మ, టీబీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వన్నెంపెల్లి జగన్మోహన్ శర్మ, హైకోర్టు న్యాయవాది ఈశ్వరప్రగడ హరిబాబు, మాదిరాజు హనుమంతరావు, వనం కృష్ణవేణి, మోత్కూరు రామేశ్వరరావు, నెమిలికొండ కిరణ్ కుమార్, మూర్తి వీరభద్ర ప్రసాద్, సరస్వతి భట్ల శ్రీధర్, కాండూరు ఆదిత్య సరస్వతీ కుమార్, మూర్తి, పూటపుకూర మాధవీలత, మూర్తి విశాలి, సావిత్రి పాల్గొన్నారు.

మిద్దె పంటలతో ఆరోగ్యం భేష్..

ఖమ్మంఅర్బన్: మిద్దెపై సేంద్రియ పంటలైన కాయగూరలు సాగుతో ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని, మిద్దెసాగును ప్రోత్సహిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు అనేక మందిని ప్రోత్సహించాలని పలువురు మిద్దెసాగుదారులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఆదివారం కార్తీకమాసం సందర్భంగా నగరంలోని బల్లేపల్లిలోని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మానుకొండ రాధాకిశోర్ మామిడితోటలో సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్ ఆధ్వర్యంలో వనసమారాధన కార్యక్రమం జరిగింది. ముందుగా మామిడితోటలో కార్తీక మాసం సందర్భంగా పూజలు చేసి ఆత్మీయ సమావేశం కొనసాగించారు. ఈ సందర్భంగా పాల్గొన్న వారు తమ అనుభవాలు, సాగు వివరాలు, ఆరోగ్యం పరంగా ఎంత ఉపయోగ కరం తదితర వాటిపై మాట్లాడారు. సాగు చేసి మంచి ఫలితాలు సాధిస్తూ ఇతరను ప్రోత్సహిస్తున్న పలువురిని సన్మానించి జ్ఞాపికను, ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. వివిధ రకాల కూరగాయల విత్తనాలను సేకరించి ఆత్మీయ సమావేశంకు హాజరైన అందరికీ పంపిణీ చేశారు.



ఖమ్మంఅర్బన్: మిద్దె సాగుదారుల ఆధ్వర్యంలో..



నేలకొండపల్లి: ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

నేలకొండపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం వనసమారాధాన కార్యక్రమం వైభోపేతంగా నిర్వహించారు. బైరవునిపల్లి గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో వనసమారాధన కార్యక్రమం ను చేపట్టారు. మహిళలు బోనాలు ఎత్తుకుని భారీ ప్రదర్శన నిర్వహించారు. ఉసిరి చెట్టు కు పూజలు చేశారు. యువత, చిన్నారులు నృత్యాలు, ఆటా, పాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం పెద్దలు పాల్గొన్నారు.